# మనం


## హైదరాబాద్

రంగారెడ్డి | మేడ్చల్

గురువారం | 16 | ఏప్రిల్ | 2026 | పేజీలు: 8


# ఐఏఎస్ క్వార్టర్స్‌లో డాగ్ ఫైట్

**పెంపుడు కుక్క చిచ్చు..**
**పోలీస్ స్టేషన్ మెట్లెక్కిన అధికారులు!**



హైదరాబాద్, ఏప్రిల్ 15 (మనం న్యూస్): హైదరాబాద్ మహానగరంలోనే అత్యంత విలాసవంతమైన, కట్టుదిట్టమైన భద్రత ఉండే బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లోని ఐఏఎస్ క్వార్టర్స్‌లో బుధవారం ఒక హైడ్రామా చోటు చేసుకుంది. సమాజంలో అత్యున్నత హోదాల్లో ఉండి, వేలాది మందికి ఆదర్శంగా నిలవాల్సిన ఐఏఎస్ అధికారుల మధ్య ఒక చిన్న 'పెంపుడు కుక్క' వ్యవహారం చినికి చినికి గాలివానలా మారింది. చివరికి ఈ గొడవ కాస్తా పోలీస్ స్టేషన్ మెట్లెక్కి, ఎఫ్ఐఆర్ నమోదు వరకు వెళ్లడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ గొడవకు ప్రధాన సూత్రధారి ఒక పెంపుడు కుక్క. నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి సుతన్, ఫిర్యాదుదారు నితికా సింగ్. ఇద్దరూ ఇరుగు పొరుగునే నివసిస్తున్నారు. నితికా సింగుకు చెందిన పెంపుడు కుక్క, సుతన్ ఇంటి ముందు మలవిసర్జన చేసిందనేది అసలు సమస్య. తమ ఇంటి ఆవరణ అపరిశుభ్రం అవుతోందన్న ఆగ్రహంతో సుతన్ ఒక్కసారిగా సంయమనం కోల్పోయారు. కుక్క చేసిన -మిగతా 2లో




# కల్వకుంట్ల రామారావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

పీర్జాదిగూడలో మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పార్టీలో చేరికలు. ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.






# మండుతున్న ఎండలు.. వడగాల్పులు..

*రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా వడదెబ్బ తగలకుండా, వడగాలుల లో తీసుకోవలసిన నివారణ చర్యలకు సంబంధించి చేయవలసినవి, చేయకూడని వాటి పై మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచనలు జారీ చేసారు. ఈ అంశాలను జిల్లా ప్రజలు తెలుసుకొని జాగ్రత్తలు పాటించాలని సూచించారు.*

**అప్రమత్తంగా ఉండాలంటున్న జిల్లా కలెక్టర్ మన చౌదరి**

మేడ్చల్, ఏప్రిల్ 15 ( మనం జిల్లా ప్రతినిధి): రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా వడదెబ్బ తగలకుండా, వడగాలుల లో తీసుకోవలసిన నివారణ చర్యలకు సంబంధించి చేయవలసినవి, చేయకూడని వాటి పై మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచనలు జారీ చేసారు. ఈ అంశాలను జిల్లా ప్రజలు తెలుసుకొని జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

సాధ్యమైనంత వరకు ఇంట్లోనే ఉండాలన్నారు. ఉల్లిపాయ సలాడ్ మరియు ఉప్పు, జీలకర్రతో కూడిన పచ్చి మామిడి వంటి సాంప్రదాయ నివారణలు వడదెబ్బను నివారించగలవని సూచించారు. పిల్లలను లేదా పెంపుడు జంతువులను మూసి ఉన్న వాహనంలో ఎప్పుడూ ఒంటరిగా వదిలిపెట్టవద్దని, ఫ్యాన్లను వాడుతూ, తరచుగా చల్లటి నీటితో స్నానం చేయాలని సూచించారు.మీ ఇంటికి లేదా కార్యాలయానికి వచ్చే అమ్మకందారులకు మరియు డెలివరీ చేసేవారికి నీటిని అందించాలని, ప్రజా రవాణాను, కార్-పూలింగ్ను ఉపయోగించాలని, తద్వారా భూతాపాన్ని, వేడిని తగ్గించడానికి సహాయపడుతుందని వివరించారు. ఎండు ఆకులు, వ్యవసాయ వ్యర్థాలు మరియు చెత్తను కాల్చవద్దని సూచించారు. జలాశయాలను సంరక్షించండి వర్షపు నీటిని సేకరించే పద్ధతులను పాటించాలన్నారు. మీకు తల తిరుగుతున్నట్లు అనిపించినా లేదా అనారోగ్యంగా ఉన్నా, వెంటనే వైద్యుడిని కలవాలని లేదా మిమ్మల్ని వెంటనే వైద్యుడి వద్దకు తీసుకువెళ్ళమని ఎవరికైనా తెలపాలని సూచించారు. రేడియో వినండి, టీవీ చూడండి; స్థానిక -మిగతా 2లో



# ఐఏఎస్ క్వార్టర్స్‌లో డాగ్ ఫైట్

మొదటి పేజీ తరువాయి

పనికి ఆగ్రహించిన సుతన్, ఆమె ఇంటి వద్దకు వెళ్లి నానా హంగామా సృష్టించారు.ఇంట్లో ఉన్న సహాయక సిబ్బందిపై ఆయన తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. అంతేకాదు ఆగ్రహంతో ఊగిపోతూ నితికా సింగ్ ఇంటి తలుపులను గట్టిగా బాది భయభ్రాంతులకు గురిచేశారు. ఇంటి ముందు అలంకరణ కోసం ఉంచిన పూల కుండీలను సైతం ఆయన ధ్వంసం చేశాడు.ఒక ఐఏఎస్ అధికారి స్థాయి వ్యక్తి, చిన్న విషయానికి ఇలా వీధి గొడవకు దిగడం, విధ్వంసానికి పాల్పడటం తమను షాక్కు గురిచేసిందని బాధితురాలు ఆవేదనవ్యక్తం చేశారు. ఈ హఠాత్ పరిణామంతో తాము ఆందోళన చెంది పోలీసులను ఆశ్రయించామని ఆమె తెలిపారు. ఒక చిన్న పెంపుడు కుక్క చేసిన పనికి ఇంతటి విధ్వంసానికి దిగడం పట్ల ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కచ్చితంగా ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

# మండుతున్న ఎండలు.. వడగాల్పులు..

మొదటి పేజీ తరువాయి

వాతావరణ వార్తల కోసం వార్తాపత్రిక చదవండి టి-వెదర్ మొబైల్ యాప్ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు.

దాహం వేయకపోయినా కూడా, తగినంత నీరు త్రాగుతూ ఉండాలని, మూర్ఛ వ్యాధి, గుండె, మూత్రపిండాలు, కాలేయ వ్యాధులు ఉండి, ద్రవపదార్థాల పరిమితి గల ఆహారం తీసుకుంటున్నవారు, శరీరంలో ద్రవాలు నిలిచిపోయే సమస్య ఉన్నవారు, ద్రవపదార్థాలు తీసుకోవడం పెంచే ముందు వైద్యుడిని సంప్రదించాలని సూచించారు.

శరీరాన్ని డీహైడ్రేట్ కాకుండా ఉంచుకోవడానికి ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్), లస్సీ, తోరణి (బియ్యం నీరు), నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీళ్లతో పాటు ఇంట్లో తయారుచేసిన పానీయాలను తీసుకోవాలన్నారు.తేలికైన, లేత రంగు, వదులుగా ఉండే కాటన్ దుస్తులను ధరించాలన్నారు.

బయట ఉన్నట్లయితే, మీ తలను గుడ్డ, టోపీ లేదా గొడుగు తో కప్పి ఉండేలా చూసుకోవాలని, మీ కళ్ళను రక్షించుకోవడానికి సన్ గ్లాసెస్, మీ చర్మాన్ని



రక్షించుకోవడానికి సన్స్క్రీన్ ఉపయోగించాలన్నారు.

**చేయకూడనివి:**

ముఖ్యంగా మధ్యాహ్నం 12 నుండి 3:00 గంటల మధ్యలో ఎండ తగిలే ప్రదేశాలలోకి వెళ్లకూడదని, మధ్యాహ్నం బయట ఉన్నప్పుడు శ్రమతో కూడిన కార్యకలాపాలను నివారించాలని, కాళ్లకు చెప్పులు లేకుండా బయటకు వెళ్లవద్దని సూచించారు. ఎండ ఎక్కువగా సమయాల్లో వంట చేయడం మానుకోవాలని, వంట చేసే ప్రదేశానికి తగినంత గాలి వచ్చేలా తలుపులు, కిటికీలు తెరిచి ఉంచాలని పేర్కొన్నారు. శరీరాన్ని నిర్జలీకరణం చేసే మద్యం, టీ, కాఫీ మరియు కార్బోనేటెడ్ శీతల పానీయాలకు దూరంగా ఉండాలని, గర్భిణీ స్త్రీలు అనారోగ్య సమస్యలు ఉన్న ఉద్యోగులపై అదనపు శ్రద్ధ వహించాలని సూచించారు. శరీరాన్ని నిర్జలీకరణం చేసే మద్యం, టీ, కాఫీ మరియు కార్బోనేటెడ్ శీతల పానీయాలకు దూరంగా ఉండాలని, అధిక ప్రోటీన్, ఉప్పు, కారం మరియు నూనెతో కూడిన ఆహారాన్ని తీసుకోకూడదని వివరించారు.కంప్యూటర్లు లేదా గృహోపకరణాల వలె అనవసరమైన వేడిని ఉత్పత్తి చేయగల ప్రకాశవంతమైన లైట్ బల్బులను ఉపయోగించకూడదని సూచించారు.

పై విషయాలను దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుతం నెలకొన్న వేసవి కాలంలో ఎలాంటి విపత్తులు సంభవించకుండా నివారించడానికి అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వివరించారు.

# కల్వకుంట్ల రామారావు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరికలు

**పీర్జాదిగూడలో మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పార్టీలో చేరికలు. ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.**

(మనం న్యూస్ ఏప్రిల్ 15) మేడిపల్లి రిపోర్టర్: మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం పీర్జాదిగూడలో శ్రీ పల్లవి కన్వెన్షన్ హాల్ పలువురు కాంగ్రెస్ పార్టీ నుండి మున్సిపల్ కౌన్సిలర్లు చేరికల సమావేశంలో ముఖ్యఅతిథిగా టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల రామారావు, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు, మేడ్చల్ పార్లమెంటు సభ్యులు రాగిడి లక్ష్మణ్ రెడ్డి, శ్యామ మల్లేష్ తదితరులు హాజరయ్యారు, ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ కార్పొరేటర్ కొడే పోచయ్య, విద్యవేత్త ఆకుల మధుకర్, వెల్లంకి శశిధర్ రెడ్డి, దొంతిరి మధుసూదన్ రెడ్డి, నారాయణరెడ్డి, ఒంటేరు మాధవ రెడ్డి, సోమిరెడ్డి, తో పాటు ఇతర పార్టీల చెందిన పలువురు నాయకులు టిఆర్ఎస్ పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు.

**రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుప్పకూలిందన్నారు. కేటీఆర్.**

కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం బిఆర్ఎస్ పార్టీ ఉన్న పది సంవత్సరాలు రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు, కాంగ్రెస్ పార్టీ రెండున్నర ఏళ్ళు పరిపాలన చేసి బుల్డోజర్ పరిపాలన సాగిస్తుంది అన్నారు, హైదరాబాద్ మహా పట్టణం రియల్ ఎస్టేట్ వ్యాపారం కుప్పకూలిందన్నారు, తెలంగాణ రాష్ట్రంలో ప్రజలపై అధిక ఒత్తిడి పెంచుతుంది అన్నారు ఇల్లు కట్టుకున్న బడుగు బలహీన వర్గాలకు చెందిన ఇళ్లపై హైడ్రా అని పేరు చెప్పి ఇళ్లను కూల్చడం మంచిది కాదన్నారు. రాష్ట్రంలో టిఆర్ఎస్ పార్టీ ఉన్నప్పుడు నిరుపేదలకు 59 జీవో ఇచ్చి రెండు లక్షల 50 వేల మందికి పట్టాలు మంజూరం చేశామన్నారు, లక్ష పైన డబుల్ బెడ్ రూములు కట్టిన మన్నారు, రాష్ట్రంలో బుల్డోజర్ రాజ్యాంగం నడుస్తుంది అన్నారు, చరిత్ర ఎన్నడు లేని విధంగా హైదరాబాద్ నగరాల్లో సొంతగా రెండుసార్లు మేయర్ పీఠాన్ని గులాబీ జెండా మేయర్ కేటీఆర్ గుర్తు చేశారు,



కరెంటు కోతలు లేకుండా, తాగునీరు పారిశుద్ధ్యం నుండి మొదలుకొని ప్రజా ప్రవాహన వరకు అన్ని రంగాల్లో నగరాన్ని ముందు తీసుకుపోయమని కేటీఆర్ గుర్తు చేశారు, అందుకే ప్రజలు రెండుసార్లు మేయర్ పీఠాన్ని ఎగిరేసామని కేటీఆర్ గుర్తు చేశారు.

రాష్ట్ర రాజధానిలో కనీసం దోమల నివారణ కూడా చేయలేనంత దుర్మార్గమైన పరిపాలన వైఫల్యం నెలకొని ఉన్నదని నగరంలో పది సంవత్సరాల క్రితం లేనటువంటి కరెంటు కోతలు, మంచి నీటి ఇబ్బందులు, పారిశుద్ధ్య సమస్యలు అన్ని తిరిగి రాష్ట్ర రాజధానిలో దర్శనిస్తున్నాయని, నగర ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని కేటీఆర్ అన్నారు.

**ఆరు గ్యారంటీలు పక్కా అమలు చెయ్యాలి , కేటీఆర్.**

కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధి ఉంటే మేనిఫెస్టో లో పొందుపరిచిన ఆరు గ్యారెంటీలు పక్కా అమలు చేయాలని కేటీఆర్ అన్నారు, అంతేకాకుండా 420 హామీలు పక్కా అమలు చేయలేకపోతే ప్రజలు నిలదీసి అడగాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

ఉప్పల్ నుంచి నారపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జిని 8 ఏళ్లు సెంట్రల్ బిజెపి పార్టీని పూర్తి చేయలేదన్నారు . కేటీఆర్

దక్షిణాది రాష్ట్రాలపై డిలిమిటేషన్ పేరుతో అన్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుందని వివరించారు, టిఆర్ఎస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు, అవసరమైతే కెసిఆర్ నాయకత్వంలో ఉద్యమం



చేపడుతామని హెచ్చరించారు.

ఉప్పల్ ఫ్లైఓవర్ పనులు ఎన్ని సంవత్సరాలుగా సాగుతూనే ఉన్నాయని, నిర్లక్ష్యం లోపంతో అభివృద్ధి నిలిచిపోయిందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్,దొంతిరి హరిశంకర్ రెడ్డి,మధుసూదన్ రెడ్డి, లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి, మహిళా అధ్యక్షరాలు నిర్మల, యూత్ అధ్యక్షులు ప్రభు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి,మైనారిటి అధ్యక్షులు జిలాని పాష, జావీద్ ఖాన్, మాజీ మేయర్లు సామల బుచ్చిరెడ్డి, మేకల కావ్య, పోచారం మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రెడ్యానాయక్, బోడుప్పల్ అధ్యక్షులు మంద సంజీవ రెడ్డి, సీనియర్ నాయకులు కొత్త రవి గౌడ్, మీసాల కృష్ణ, కొండల్ రెడ్డి, శేఖర్, మాధవ్ రెడ్డి, సురేందర్ రెడ్డి, రమేష్, పీర్జాదిగూడ, బోడుప్పల్, పోచారం, ఘట్కేసర్ నాయకులు మహిళలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

చేవెళ్ల, ఏప్రిల్ 15 (మనం న్యూస్) : అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా చేవెళ్ల బస్టాండ్ ఆవరణలో ఫైర్ స్టేషన్ అధికారులు, సిబ్బంది బుధవారం ప్రయాణికులకు మరియు స్థానిక ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రాణ, ఆస్తి నష్టాన్ని ఎలా నివారించాలో ప్రత్యక్షంగా వివరించారు. ఈ సందర్భంగా ఫైర్ అధికారులు మాట్లాడుతూ.. ఎండాకాలం దృష్ట్యా అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా షార్ట్ సర్క్యూట్, గ్యాస్ లీకేజీల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బస్టాండ్లోని ప్రయాణికులకు ప్రమాదం సంభవించినప్పుడు 'ఫైర్ ఎక్స్టింగ్విషర్' (అగ్నిమాపక యంత్రం)ను ఎలా వాడాలో ప్రయోగాత్మక ప్రదర్శన ద్వారా చూపించారు. ప్రమాదం జరిగిన వెంటనే భయపడకుండా 101 నంబర్కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.సిగరెట్ ముక్కలు, అగ్గిపుల్లలను ఎక్కడపడితే అక్కడ పడేయకూడదని వివరించారు. గ్యాస్ సిలిండర్ వాడకం అయిపోయాక రెగ్యులేటర్ కట్టేయడం మర్చిపోవద్దన్నారు.ఈ కార్యక్రమంలో ఫైర్ సర్వీస్ సిబ్బంది, బస్టాండ్ అధికారులు, ప్రయాణికులు మరియు స్థానిక వ్యాపారులు పాల్గొన్నారు.

## కుండ భానుచందర్‌కు దళిత రత్న అవార్డు

మేడ్చల్, ఏప్రిల్ 15 ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుండ భానుచందర్ కు దళిత రత్న అవార్డు దక్కింది. డాక్టర్ బాబాసాహెబ్ భీమ్ రావు అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14న రవీంద్రభారతిలో కుండ భానుచందర్ కు దళితరత్న అవార్డ్ ప్రధానం చేశారు. కుండ బాలచందర్ చేస్తున్న సేవలకు గాను ఈ అవార్డు ను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కుండ భానుచందర్ మాట్లాడుతూ దళిత రత్న



అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని ఇందుకు సహకరించిన పెద్దలకు, దళితరత్న అవార్డు రావడానికి నన్ను గుర్తించి నాకు సహరించిన పెద్దలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కుండా భానుచందర్ పేర్కొన్నారు. దళిత రత్న అవార్డు తీసుకున్న తర్వాత నాపై బాధ్యత మరింత పెరిగిందని, దానికి అనుగుణంగా పని చేస్తానని తెలిపారు.

# మల్కాజిగిరిలో దోమల నియంత్రణకు సమగ్ర కార్యాచరణ

**డెంగ్యూ కేసులు 60% తగ్గింపే లక్ష్యం – వార్డ్ స్థాయిలో ప్రత్యేక చర్యలు...**




సికింద్రాబాద్, ఏప్రిల్ 15 (మనం న్యూస్) మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) పరిధిలో దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను సమర్థవంతంగా అరికట్టేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం తార్నాకలోని ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఎంతమాలజీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎంతమాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ బానోత్ రెడ్యా నాయక్ వార్డ్-లెవల్ ఇంటిగ్రేటెడ్ మస్కిటో మేనేజ్మెంట్ - 2026 ఆపరేషనల్ బ్లూప్రింట్‌పై సమగ్ర ప్రెజెంటేషన్ ఇచ్చారు. ప్రతి వార్డును స్వయం సమృద్ధిగా రూపొందిస్తూ హౌస్ ఇండెక్సు 1 శాతం కంటే తక్కువగా, బ్రెటో ఇండెక్సు 5 కంటే తక్కువగా ఉంచడం, గత ఐదేళ్ల సగటుతో పోలిస్తే డెంగ్యూ కేసులను 60 శాతం వరకు తగ్గించడం లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. దోమల పెరుగుదలకు దారితీసే ఓపెన్ డ్రైనేజీలు, నిల్వ నీరు, గృహ వినియోగ నీటి నిల్వలు, నిర్మాణ ప్రదేశాలు, చెత్త నిల్వలు, అలంకార నీటి వనరులు, మురుగు వ్యవస్థలు వంటి ఏడు ప్రధాన వనరులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సోర్స్ రిడక్షన్ (పరిసరాల శుభ్రత), బయోలాజికల్ కంట్రోల్ (లార్వివోరస్ చేపలు, బయో ఏజెంట్లు), ఫిజికల్, మెకానికల్ పద్ధతులతో పాటు అవసరమైనప్పుడు మాత్రమే రసాయనాల వినియోగం వంటి బహుస్థాయి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రతి వార్డులో జోనల్ మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షణలో యాంటీ లార్వల్ టీమ్లు, ఫాగింగ్ యూనిట్లు, డ్రోన్ సపోర్ట్తో కూడిన వ్యవస్థను అమలు చేయనున్నారు. వారానికి ఒకసారి సర్వేలు, లార్విసైడింగ్, డ్రై డే కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బీటీఐ, లార్వివోరస్ చేపలు, మెసోసైక్లోప్స్ వినియోగంతో పాటు అవసరమైతే టెమీఫోస్, మలాథియన్ వంటి రసాయనాలను ప్రమాణాల ప్రకారం వినియోగించనున్నారు. డెంగ్యూ లేదా మలేరియా కేసులు నమోదైన ప్రాంతాల్లో వెంటనే ఇండోర్ రెసిడ్యువల్ స్ప్రేయింగ్ చేపట్టనున్నారు. అదేవిధంగా డిజిటల్ సర్వైలెన్స్ ద్వారా రియల్ టైమ్ డేటా సేకరణ, విశ్లేషణ చేపట్టి తక్షణ చర్యలు తీసుకునే విధంగా ఆధునిక పద్ధతులను ప్రవేశపెట్టనున్నారు. కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి మాట్లాడుతూ దోమల నిర్మూలనపై క్షేత్రస్థాయిలో ప్రతిరోజూ పర్యవేక్షణ చేపడతానని, అధికారులు నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. ఈ సమగ్ర కార్యాచరణతో పౌరులకు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడం లక్ష్యమని తెలిపారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్లు రాధిక గుప్తా, సంచిత్ గంగ్వార్, అడిషనల్ కమిషనర్ సి.ఎన్. రఘు ప్రసాద్, జాయింట్ కమిషనర్ (హెల్త్) మోహన్ రెడ్డి, సీనియర్ ఎంటమలాజిస్ట్ మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ నీటి సమస్య కొలిక్కి

**హెచ్ఎం డబ్ల్యూ ఎస్ అధికారుల పర్యటన**
**ఘనపూర్ నుండి మేడ్చల్ వరకు ఉన్న లోపాల పరిశీలన**
**మేడ్చల్ కు సరిపడ నీటిని సరఫరకు అధికారుల గ్రీన్ సిగ్నల్**
**హర్షం వ్యక్త చేసిన మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్**

మేడ్చల్, ఏప్రిల్ 15 ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ లో నెలకొన్న మంచినీటి సమస్య ఒక కొలిక్కి వస్తుంది. ఇటీవల హెచ్ఎం డబ్ల్యూ ఎస్ అధికారులు మేడ్చల్ లో పర్యటించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. ఘనపూర్ పంప్ హౌస్ నుండి మేడ్చల్ వరకు సమస్య ఎక్కడుంది అనే విషయంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి సమస్య పరిష్కరించే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు.

**మేడ్చల్ జనాభాకు సరిపడా నీరు సరఫరాకు గ్రీన్ సిగ్నల్**

మేడ్చల్ జనాభాకు సరిపడా మిషన్ భగీరథ నీటి సరఫరాకు హెచ్ఎం డబ్ల్యూ ఎస్ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం మేడ్చల్ జనాభా ప్రతిపాదికన 7.5 ఎం ఎల్ డి మిషన్ భగీరథ నీరు అవసరం కాగా గత ఆరు నెలల నుండి




1.5 నుంచి 3 ఎం ఎల్ డి నీరు సరఫరా కావడం వల్ల మేడ్చల్ పట్టణంలోని ఓవరేడ్ ట్యాంకులు నిండడానికి 5 నుంచి 6 రోజులు పట్టడం వల్ల మేడ్చల్ పట్టణవాసులు తీవ్ర మంచినీటి ఎద్దడిని ఎదుర్కొన్నారు. కొన్ని ప్రాంతాలలో రోజుల తరబడి కుల్లాయి నుంచి నీరు రాకపోవడం వల్ల వేల రూపాయలు ఖర్చుపెట్టి ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకొని వాడుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

**అధికారుల చుట్టూ తిరిగి సక్సెస్ అయిన చీర్ల రమేష్**

మేడ్చల్ లో నెలకొన్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని మేడ్చల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ అధికారుల చుట్టూ తిరిగి నేటి సమస్య పరిష్కారాన్ని ఒక కొలిక్కి తీసుకొచ్చారు. మొదట మేడ్చల్ లో నెలకొన్న నీటి సమస్యను హెచ్ఎం డబ్ల్యూ ఎస్ కమీషనర్ అశోక్ రెడ్డి దృష్టికి, అక్కడినుండి అక్కడి నుండి సీఎంసి కమిషనర్ దృష్టికి, ఈడి దృష్టికి సిజిఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం కోసం తీవ్ర స్థాయిలో కృషి చేశారు. చివరకు ఈ అధికారులు మేడ్చల్ కు వచ్చి పరిస్థితిని సమీక్షించేలా వాయిస్ చైర్మెన్ చీరల రమేష్ ప్రయత్నించారు. మేడ్చల్ కు సరిపడా మిషన్ భగీరథ మీరు సరఫరా అయ్యేలా కృషి చేశారు.



**భవిష్యత్తులో కూడా ప్రజల కోసం పనిచేస్తా**

భవిష్యత్తులో కూడా ప్రజల కోసం పనిచేస్తానని మాజీ వైస్ చైర్మన్ చీరల రమేష్ తెలిపారు. మేడ్చల్ పట్టణానికి సరిపడా మిషన్ భగీరథ నీటి సరఫరాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన హెచ్ఎం డబ్ల్యూ ఎస్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చీర్ల రమేష్ తెలిపారు.

# అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు

**నిబంధనలు ఉల్లంఘిస్తే భవనాలు సీజ్: కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి..**



నాచారం, ఏప్రిల్ 15 (మనం న్యూస్) మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలో అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే భవనాలను సీజ్ చేస్తామని కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి హెచ్చరించారు.99 రోజుల కార్యాచరణ - ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం నాచారం సర్కిల్ పరిధిలోని తిరుమల నగర్, కృష్ణా నగర్, నాచారం, రాఘవేంద్ర నగర్, కార్తికేయ నగర్ ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. తిరుమల నగర్లో వాణిజ్య సముదాయాల్లో ట్రేడ్ లైసెన్సులను పరిశీలించిన కమిషనర్, నిబంధనలు పాటించని ఫ్లాంటర్ బాక్సును తొలగించాలని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న భవనాలు సరైన సెట్బ్యాక్లతో ఉండాలని సూచించారు. కృష్ణా నగర్లో స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమైన ఆయన, ఆర్థిక సహాయం, రుణ సౌకర్యాలపై అవగాహన కల్పిస్తూ, వారి ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు మార్గనిర్దేశం చేశారు. మహిళల ఆర్థిక సాధికారతకు ఎంఎంసీ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. నాచారం ఎలిఫెంట్ సర్కిల్లో ఓ నిర్మాణదారుడు జీ ప్లస్ 3 అనుమతి తీసుకొని అదనంగా రెండు అంతస్తులు నిర్మించిన వాణిజ్య భవనాన్ని గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా రహదారి ఆక్రమణ కూడా జరిగినట్లు వెల్లడించారు. పట్టణ ప్రణాళిక నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. అలాగే నాచారం పోలీసు స్టేషన్ ఎదురుగా రాఘవేంద్ర నగర్లోనూ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టడంతో పాటు సుమారు రూ.14 లక్షల ఆస్తి పన్ను బకాయిలు ఉన్న వాణిజ్య భవనాన్ని అధికారులు సీజ్ చేశారు. సంబంధిత వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. కార్తికేయ నగర్లో నాలా డీసిల్టింగ్ పనులను పరిశీలించిన ఆయన, నిర్ణీత గడువులో పనులు పూర్తి చేసి నీటి ప్రవాహం సజావుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగరాభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజా సంక్షేమం లక్ష్యంగా ఈ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని కమిషనర్ పేర్కొన్నారు.



## సిమెంటు రోడ్లు, డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

**బస్తీవాసుల వినతి**

నాచారం, ఏప్రిల్ 15 (మనం న్యూస్) బాబా నగర్, హనుమాన్ నగర్ బార్డర్ల పరిధిలో సిమెంటు రోడ్లు నిర్మాణం చేపట్టాలని కోరుతూ స్థానిక బస్తీవాసులు నాచారం మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హనుమాన్ నగర్ నుండి బాబా నగర్ ఐస్ ఫ్యాక్టరీ చౌరస్తా వరకు భూగర్భ డ్రైనేజీ సమస్యలను ఇటీవల పరిష్కరించినప్పటికీ, ఐస్ ఫ్యాక్టరీ పక్క వీధి మరియు న్యూడిల్స్ వీధిలో డ్రైనేజీ పనులకు నిధులు మంజూరైనా ఇంకా పనులు ప్రారంభం కాలేదని వారు వివరించారు. డ్రైనేజీ పనులు పూర్తి చేయకపోవడంతో సిమెంటు రోడ్ల నిర్మాణం ఆలస్యమవుతోందని పేర్కొంటూ, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి రోడ్లు వేయాలని బస్తీవాసులు కోరారు. వెంటనే స్పందించిన మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ జలమండలి అధికారులతో మాట్లాడగా, పైపుల కొరత కారణంగా పనులు ఆలస్యమవుతున్నట్లు అధికారులు తెలిపారు. దీనిపై తక్షణమే పైపులు సమీకరించి పనులను ప్రారంభించాలని ఆమె అధికారులను ఆదేశించారు. అలాగే డ్రైనేజీ పనులు పూర్తైన వెంటనే సిమెంటు రోడ్లు కూడా వేయిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుజాత, రవి, సురేష్, గోపి, మనోజ్, పవన్, నరసింహ, గోపాల్, కరుణాకర్, రాధమ్మ, సాయిజెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓయూలో ఏబీవీపీ రౌండ్ టేబుల్ సమావేశం

**- ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలపై ఆందోళన..**

సికింద్రాబాద్, ఏప్రిల్ 15 (మనం న్యూస్) అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఉస్మానియా యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ అంశాలపై బుధవారం ఆర్ట్స్ కళాశాల వేదికగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గౌరవ హైకోర్టు విద్యార్థుల నుంచే ఫీజులు వసూలు చేసుకోవచ్చని మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాల్సి వచ్చిందని సమావేశంలో నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ఓయూ అధ్యక్షులు గెల్లు శేఖర్, కార్యదర్శి మోక్షిత్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్య అందించే ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని బలహీనపర్చే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రతి సంవత్సరం సుమారు 14 లక్షల మంది విద్యార్థులు ఈ పథకంపై ఆధారపడి ఉన్నారని, దాదాపు ₹10,000 కోట్ల బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. విద్యపై పెట్టే ఖర్చు దేశాభివృద్ధికి పెట్టుబడిగా పరిగణించాల్సిన అవసరం ఉందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి భారీ స్థాయిలో ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సిటీ సెక్రటరీ పృథ్వీతేజ, నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జీవన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అలివేలి రాజు, విద్యానగర్ విభాగ్ కన్వీనర్ హరిప్రసాద్, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ వర్ష, జిల్లా కన్వీనర్ సాయి తేజ,

స్టేట్ యూనివర్సిటీస్ కో కన్వీనర్ గంధం నరేందర్, స్టేట్ లా ఫోరం కో కన్వీనర్ వెంకటేష్, తన్వి, అజయ్, విజయ్ సింగ్, శివ, శ్రీకర్, అంజన్, సురేందర్, సుమ, ప్రియా, అనిత, దిగావత్ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.






## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- చేవెళ్ల శాసనసభ్యులు కాలె యాదయ్య.**

చేవెళ్ల,ఏప్రిల్ 15(మనంన్యూస్): పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని దుద్దాగు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య బుధవారం ప్రారంభించారు. లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం చేసిన ఆయన మాట్లాడారు . పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## టెన్త్ మూల్యాంకన కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ

మేడ్చల్, ఏప్రిల్ 15 ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలానగర్ పరిధిలో గల ఎన్ ఎస్ కే కే పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి సమాధాన పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని బుధవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ




కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి పాల్గొన్నారు.

తనిఖీలో భాగంగా అదనపు కలెక్టర్ మూల్యాంకన ప్రక్రియ జరుగుతున్న తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు ఉపాధ్యాయులకు పలు కీలక సూచనలు జారీ చేశారు.

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, సమాధాన పత్రాల దిద్దుబాటులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎండ తీవ్రత దృష్ట్యా మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులకు అవసరమైన తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కూలర్లు వంటి కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశించిన గడువులోగా మూల్యాంకన ప్రక్రియను పూర్తి చేసి, ఫలితాల విడుదలకు సహకరించాలని కోరారు. వాల్యుయేషన్ కేంద్రం వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు ఉండాలని, అనధికార వ్యక్తులు లోపలికి రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఈ పర్యవేక్షణలో స్పాట్ క్యాంప్ ఆఫీసర్లు, సహాయక సిబ్బంది, విద్యాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేరప్రవర్తన కలిగిన వ్యక్తికి జైలు శిక్ష



సికింద్రాబాద్, ఏప్రిల్ 15 (మనం న్యూస్) చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తిస్తూ, ఇతరులకు హాని కలిగించే చర్యలకు పాల్పడిన ఒక నేర స్వభావం గల వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, నిందితుడు ముషీరాబాద్కు చెందిన ఎండి. సుఫియాన్ (25), ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. స్థానికంగా అతని ప్రవర్తనపై వచ్చిన ఫిర్యాదుల మేరకు చిలకలగూడ ఇన్స్పెక్టర్ వలిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది విచారణ చేపట్టి నిందితుడిని పట్టుకున్నారు. తదుపరి, కేసు నమోదు చేసి కోర్టు కానిస్టేబుల్ బి. శ్రీనివాస్ సహకారంతో నిందితుడిని సికింద్రాబాద్ కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం కోర్టు నిందితుడికి 60 రోజుల జైలు శిక్ష విధించింది. ఈ ఘటనతో నేరాలకు పాల్పడే వారికి పోలీసులు గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు.



## ఉస్మానియా యూనివర్సిటీలో టీజీ-సెట్ 2025 సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రారంభం

**మే నెలలో టీజీ-సెట్ 2026 నోటిఫికేషన్ విడుదలకు సిద్ధం..**

సికింద్రాబాద్, ఏప్రిల్ 15 (మనం న్యూస్) ఉస్మానియా యూనివర్సిటీలో టీజీ-సెట్ 2025లో ఉత్తీర్ణులైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నత విద్యా రంగంలోకి ప్రవేశించబోతున్న అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలన యూనివర్సిటీ ప్రాంగణంలోని టీజీ-సెట్ కార్యాలయంలో కొనసాగుతోంది. ఈ ప్రక్రియను పరిశీలించేందుకు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అభ్యర్థులతో మాట్లాడిన ఆయన, టీజీ-సెట్ 2025లో విజయాన్ని సాధించిన వారికి అభినందనలు తెలిపారు. పరీక్షను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించడంలో టీజీ-సెట్ బృందం కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. మొత్తం 29 సబ్జెక్టులకు సంబంధించిన వెరిఫికేషన్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు యూనివర్సిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. అభ్యర్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రక్రియ కొనసాగుతోంది. ఈ వెరిఫికేషన్ కార్యక్రమం ఏప్రిల్ 19, 2026 నాటికి పూర్తికానుంది. ఇక, భవిష్యత్ అభ్యర్థులకు ఊరటనిస్తూ టీజీ-సెట్ 2026 నోటిఫికేషన్ను మే నెలలో విడుదల చేయనున్నట్లు వైస్ ఛాన్సలర్ ప్రకటించారు. ముందస్తు ప్రకటనతో అభ్యర్థులు పరీక్షకు సమయానుకూలంగా సిద్ధమయ్యే అవకాశం లభించనుంది. ఉన్నత విద్యలో నాణ్యత, పారదర్శకత, అకడమిక్ శ్రేష్ఠతను కాపాడటంలో ఉస్మానియా యూనివర్సిటీ తన కట్టుబాటును మరోసారి చాటుకుంది.

# జవహర్‌నగర్‌లో నూతన చౌకధరల దుకాణం ప్రారంభం

**- లబ్ధిదారులకు రేషన్ సరుకులు సులభంగా అందించే లక్ష్యం.**



జవహర్ నగర్, ఏప్రిల్ 15 (మనం న్యూస్): జి.హెచ్.ఎం.సి పరిధిలోని జవహర్ నగర్ డబుల్ బెడ్రూమ్ కాలనీలో నూతన చౌకధరల దుకాణాన్ని ఘనంగా ప్రారంభించారు. మండల తహశీల్దార్ బైరెడ్డి రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజలకు మరింత సౌకర్యవంతంగా రేషన్ సరుకులు అందించడమే లక్ష్యంగా ఈ దుకాణాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సమర్థవంతంగా చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరుకుల పంపిణీ జరుగుతుందని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల ఆర్ఐ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మల్లేపూల శ్రీకాంత్, జవహర్ నగర్ మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి, జిల్లా చౌకధరల దుకాణం అధ్యక్షులు బల్లి శ్రీనివాసు, జవహర్ నగర్ చౌకధరల దుకాణం అధ్యక్షురాలు నంగునూరి పద్మావతి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కన్నమైన రాజు యాదవ్, యువజన అధ్యక్షుడు మాట్ల వినయ్, 28వ వార్డ్ అధ్యక్షుడు బూడిద వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే చౌకధరల దుకాణం డీలర్లు ఎండి సూరజ్ భాష, రజిత గోపాల్, నర్సింగరావు, షర్మిల కాలేష, జాషువా, మంజుల సాయి మరియు బస్తీ వాసులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## ఎంఎంసీ ఎర్లీ బర్డ్ పథకం వినియోగించుకోండి

**కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి**

సికింద్రాబాద్, ఏప్రిల్ 15 (మనం న్యూస్) మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఎర్లీ బర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి పిలుపునిచ్చారు. తార్నాకలోని ఎంఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ఏప్రిల్ 1 నుండి 30వ తేదీ లోపు ముందస్తుగా చెల్లిస్తే 5 శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. ఈ సౌకర్యం నివాస గృహాలకే కాకుండా వాణిజ్య ఆస్తులకు కూడా వర్తిస్తుందని వివరించారు. పన్ను చెల్లింపులు ఎంఎంసీ అధికారిక వెబ్సైట్ లేదా మై క్యూర్ (ఋజ్ఞఖఊ) మొబైల్ యాప్ ద్వారా ఆన్లైన్లో సులభంగా చేయవచ్చని సూచించారు. గత 15 రోజుల్లోనే రూ. 61.95 కోట్ల ముందస్తు చెల్లింపులు నమోదయ్యాయని, దీని ద్వారా పన్ను చెల్లింపుదారులకు సుమారు రూ. 3.1 కోట్ల రాయితీ లభించిందని చెప్పారు. గత సంవత్సరం ఎర్లీ బర్డ్ పథకం ద్వారా రూ. 240 కోట్లు సమకూరగా, ఈసారి రూ. 260 కోట్ల వసూళ్ల లక్ష్యంతో ఎంఎంసీ కృషి చేస్తోందన్నారు. ముందస్తు చెల్లింపుల వల్ల పన్ను చెల్లింపుదారులకు రాయితీ లభించడంతో పాటు మున్సిపల్ సంస్థకు ఆదాయం పెరుగుతుందని తెలిపారు. జీహెచ్ఎంసీ నుంచి విభజన తర్వాత చెక్కులపై కమిషనర్ ఎంఎంసి (ఇౌఝఝఱీఱజ్ఞ్ఖుట ఋ) అని తప్పనిసరిగా నమోదు చేయాలని, జీహెచ్ఎంసి (ఎఏఋ) అని ఉంటే అవి చెల్లవని స్పష్టం చేశారు. ఎర్లీ బర్డ్ పథకంపై అవగాహన పెంచేందుకు పోస్టర్లు, పాంప్లెట్లు విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు రాధికా గుప్తా, సంచిత్ గంగ్వార్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రియంబర్స్‌మెంట్‌పై మల్లారెడ్డి కాలేజీలో ధూంధాం

**ఫీజు రియంబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలి అంటూ ఏబీవీపీ డిమాండ్**

మేడ్చల్, ఏప్రిల్ 15 ( మనం జిల్లా ప్రతినిధి): ఫ్లీజ్ రియంబర్స్‌మెంట్ స్కాలర్షిప్స్ వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుంది.అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మేడ్చల్ జిల్లా మైసమ్మగూడ శాఖ ఆధ్వర్యంలో మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో గేట్ మీటింగ్ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ నేత జీవన్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 2 వేల ఇన్స్టిట్యూషన్లలో గేట్ మీటింగ్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు . తెలంగాణ రాష్ట్రంలో దాదాపు నాలుగు సంవత్సరాల నుండి పదివేల కోట్ల స్కాలర్షిప్లు ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల కాక దాదాపుగా 22 లక్షల నుండి 25 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుందని ఆరోపించారు. కొన్ని ప్రైవేట్ ఇన్స్టిట్యూషన్స్ నాలుగు సంవత్సరాలు నుంచి స్కాలర్షిప్స్,ఫీజు రియంబర్స్‌మెంట్ పై కోర్టుకు వెళితే కోర్టు ప్రభుత్వాన్ని సమాధానం అడిగితే సమాధానం ఇవ్వకపోవడం వలన వచ్చే సంవత్సరం నుండి 2026 -27 అకాడమిక్ ఇయర్లో విద్యార్థుల నుండే ఫీజులు వసూలు చేసుకోండి అని చెప్పడం చూస్తే ప్రభుత్వం మీద మొట్టికాయలు వేసినట్టే అని ఏబీవీపీ భావిస్తుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్ర మాని స్కాలర్షిప్స్ , ఫీజు రియంబర్స్‌మెంట్ తో పాటు నాణ్యమైన విద్య అందించకపోతే ప్రభుత్వం కుప్పకూలే వరకు పీఠాలు కదిలేటట్టు, ఏ ప్రజా ప్రతినిధిని కూడా రోడ్లమీద తిరుగనీయకుండా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి విభాగ్ కన్వీనర్ నాగేష్ మేడ్చల్ జిల్లా కన్వీనర్ మృత్యుంజయ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆశిష్ మైసమ్మగూడ నగర కార్యదర్శి శివ సంయుక్త కార్యదర్శి సన్నీ, రోహిత్, కార్యకర్తలు అశ్వంత్ మనీ తదితరులు పాల్గొన్నారు.



# కీసర సర్కిల్లో అక్రమ షెడ్లపై ఉక్కుపాదం










**డీసీ వసంత ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ విభాగం కఠిన చర్యలు.**

కీసర సర్కిల్, ఏప్రిల్ 15 (మనం న్యూస్): కీసర సర్కిల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన షెడ్లపై అధికారులు ఉక్కుపాదం మోపారు. కీసర పోలీస్ స్టేషన్ ప్రధాన రహదారి ప్రక్కన, అంబేద్కర్ నగర్ రోడ్డు పెట్రోల్ పంపుకు సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన రేకుల షెడ్లను టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు.

డీసీ వసంత ఆదేశాల మేరకు ప్రత్యేక బృందం రంగంలోకి దిగి, జేసీబీ మరియు ఇతర పరికరాల సహాయంతో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసింది. ఈ చర్యలతో ప్రాంతంలో అక్రమ నిర్మాణాలపై అధికారుల కఠిన వైఖరి స్పష్టమైంది.

**అనుమతులు లేకుండా నిర్మాణం గుర్తింపు..**

స్థానికుల ఫిర్యాదుల మేరకు అధికారులు స్థలాన్ని పరిశీలించగా, సంబంధిత వ్యక్తులు ఎలాంటి అధికారిక అనుమతులు పొందకుండా నిర్మాణాలు చేపట్టినట్లు తేలింది. కొంతమంది స్థానిక నాయకుల సహకారంతో ఈ అక్రమ నిర్మాణాలు జరిగాయని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రజల ఒత్తిడితో వేగవంతమైన చర్యలు.**

గత కొన్ని రోజులుగా కాలనీవాసులు అక్రమ షెడ్ల తొలగింపునకు డిమాండ్ చేస్తూ వచ్చారు. అధికారుల నిర్లక్ష్యంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రజలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరగా, ఫిర్యాదులపై వెంటనే స్పందించిన అధికారుల చర్యలను స్థానికులు స్వాగతించారు.

**భవిష్యత్లో కఠిన చర్యలు తప్పవు.**

ఇలాంటి అక్రమ నిర్మాణాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని టౌన్ ప్లానింగ్ అధికారి స్రవంతి హెచ్చరించారు. మిగిలిన నిర్మాణాలపై కూడా విచారణ కొనసాగుతోందని తెలిపారు.

ఈ కూల్చివేత కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి స్రవంతి సిబ్బంది బాలకృష్ణ, హరీష్ గౌడ్, ఎన్ఫోర్స్మెంట్ టీం తదితరులు పాల్గొన్నారు.






## మోండా డివిజన్లో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

సికింద్రాబాద్, ఏప్రిల్ 15 (మనం న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి మరో అడుగు ముందుకు పడింది. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ బుధవారం మోండా డివిజన్లో రూ.28 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను అధికారులతో, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం'లో భాగంగా హైదరాబాద్ నగర అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ఆ దిశగా మోండా డివిజన్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడం సంతోషకరమని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారి సదుపాయాలు కల్పించడం ద్వారా రోజువారీ రాకపోకలు సులభతరం అవుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోయిన్పల్లి డీసీ డాకు నాయక్, ఏఈ వరుణ్ దేవ్, సందీప్, గణేష్ టెంపుల్ ఛైర్మన్ ప్రభాకర్ యాదవ్, నాయకులు నాగేష్ యాదవ్, సంతోష్ యాదవ్, బద్రీనాథ్ యాదవ్, వైష్ణవి యాదవ్, ధనలక్ష్మి, శేఖర్ ముదిరాజ్, శ్రీనాథ్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కు నిరుపేదలకు ఎంతో మేలు



(తలకొండపల్లి ఏప్రిల్/మనం న్యూస్) : తలకొండపల్లి మండల పరిధిలోని దేవునిపడకల్. గ్రామానికి చెందిన మద్దురి సుజాత,ప్రభాకర్ కొద్ది రోజుల క్రితం ఒక ప్రైవేట్ హాస్పిటల్ లో ప్రథమ చికిత్స చేయించుకొని హాస్పిటల్ బిల్స్ ₹దేవునిపడకల్ మాజీ సర్పంచ్ కాడమోని శ్రీశైలంకి అందజేయడంతో వారుస్థానిక శాసనసభ్యులు శ్రీ కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో₹ లబ్ధిదారులు ,మద్దురి సుజాత, ప్రభాకర్ స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 19.000పందొమిది వేయిల రూపాయలు మంజూరు చేయించడం జరిగింది బుధవారం నాడు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు లబ్దిదారుడు కి ముఖ్యమంత్రి సహాయనిది చెక్కును అందించిన దేవునిపడకల్ మాజీ సర్పంచ్ కాడమోని శ్రీశైలం ఈ కార్యక్రమంలో వాళ్లతో పాటు ,ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు తుమ్మల రామస్వామి, గంగపుత్ర సంఘం అధ్యక్షులు అంబటి రమేష్, పులిజాల కృష్ణయ్య, అంబటి ఇస్తారి,కానుగుల చంద్రమౌళి,తుమ్మల శ్రీను, కాడమోని యాదయ్య, తుమ్మల మల్లేష్, కానుగుల మల్లేష్, కాడమోని లింగయ్య, తుమ్మల ఆంజనేయులు, పద్మ కుమార్,అంబటి శ్రీను, పద్మ పాండు, రాజమోని నరేష్, కాడమోని లింగం తదితరులు పాల్గొన్నారు .

# ఆయిల్ ఫామ్ సాగు రైతులకు ఎంతో లాభదాయకం

(తలకొండపల్లి ఏప్రిల్15/మనం న్యూస్): ఆయిల్ ఫామ్ సాగు రైతులకు ఎంతో మేలు చంద్రధన గ్రామానికి చెందిన రైతులు పెంటారెడ్డి, సాయి రెడ్డి ఆయిల్ పామ్ తోటలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ తోటల సాగు, పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఉద్యాన పట్టు పరిశ్రమ ఎంపీడీవో కిషన్ రావు, హెచ్ ఓ హిమబిందు ఆయిల్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రామ్ మోహన్ రావు, తలకొండపల్లి మండలం ఉద్యాన శాఖ ఇంచార్జ్ సీతారాం చంద్రధన గ్రామ ఉపసర్పంచ్ రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి మాజీ ఉపసర్పంచ్ సొల్లు సుధాకర్. బదునాపూర్ వార్డు సభ్యులు లక్ష్మీకాంత్ గౌడ్, జిల్లా అధికారి ప్రమోద్ కుమార్, మండల శాఖ అధికారులు కొండల్ రెడ్డి, అధిక సంఖ్యలో రైతులు హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగు రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. సాగు ఏ విధంగా చేయాలి, పంట దిగుబడి కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కావున ఈ పంట సాగు ను రైతులు సద్వినియోగం చేసుకోగలరని కోరారు



# కేటీఆర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన తుంగతుర్తి రవి



**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై కేటీఆర్ వ్యాఖ్యలు సరికాదు అన్నారు.**
**ప్రజా సమస్యలు పట్టించుకోని మీకు.. ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదు..**

(మనం న్యూస్ ఏప్రిల్ 15) మేడిపల్లి రిపోర్టర్ : పీర్జాదిగూడలో జరిగిన బిఆర్ఎస్ సభలో కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైన, కాంగ్రెస్ సర్కార్ పై చేసిన విమర్శలను, అనుచిత వ్యాఖ్యలను పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి తీవ్రంగా ఖండించారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచారని, అవినీతి, అక్రమాలు రాజ్యమేలాయని, కెసిఆర్ ప్రవేశపెట్టిన ప్రతి పథకంలో అంతులేని అవినీతి జరిగిందని, తన మచ్చ తాను చూసుకోకుండా గురువింద గింజ మాదిరిగా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు విడ్డూరమని, ప్రజలను వారి సమస్యలను అయినా కేటీఆర్ కు బుద్ధి రావడం లేదని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకం పేరుతో కోట్లాది రూపాయలు ప్రజాధనం వృధా చేసిన కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎంతో మంది నిరుపేదల సొంతింటి కలను సహకారం చేశారని, అధికారం కోల్పోయి కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలలో వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక కేటీఆర్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, గడచిన 30 నెలల్లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి, రైతు రుణమాఫీ, రైతు భరోసా, రేషన్ కార్డుల పునరుద్ధరణ మరియు నిరుపేదలకు సన్న బియ్యం వంటి, పథకాలను విజయవంతంగా అమలు చేస్తుందని, ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రా బి ఆర్ ఎస్ నేతల అక్రమ సామ్రాజ్యాలను నేలమట్టం చేసి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కాపాడుతుందని, కబ్జా కోరల కబంధహస్తాలలో చిక్కుకున్న వందలాది చెరువులను హైడ్రా కాపాడిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేసుకోవాలని, పీర్జాదిగూడలో ఎంతో ఆడంబరంగా ఎస్ ఎన్ డి పి పనులకు శంకుస్థాపన చేసిన కేటీఆర్ ఆ పనులను ఎందుకు పూర్తి చేయలేకపోయారు, 8 ఏళ్లు గడుస్తున్న కేంద్రాన్ని ఒప్పించలేక ఉప్పల్ - నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులు అర్ధాంతరంగా ఆపి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన మీరు ఉప్పల్ నారపల్లి ఎలివేటర్ కారిడార్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు, పీర్జాదిగూడ -కాచవోని సింగారం వరకు ప్రారంభించి వదిలేస్తే ప్రజల అవస్థలను చూడలేక కాంగ్రెస్ ప్రభుత్వం అతి కొద్ది సమయంలో ఆ రోడ్డు పనులను శరవేగంగా పూర్తి చేసి ప్రజలకు అంకితం చేసింది, గడచిన 30 నెలల్లో పీర్జాదిగూడలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై చర్చించడానికి మీరు సిద్ధమా? అని తుంగతుర్తి రవి సవాలు విసిరారు.



## గంజాయిని విక్రయిస్తున్న ముఠా అరెస్టు

మేడ్చల్, ఏప్రిల్ 15 ( మనం జిల్లా ప్రతినిధి): గుట్టు చప్పుడు కాకుండ గంజాయిని విక్రయిస్తున్న ముఠాను ఎస్ఓటి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొల్తూరు నుంచి తుర్కపల్లి వెళ్లే ఓ గ్రౌండ్లో గుట్టు చప్పుడు కాకుండా గంజాయి అమ్ముతున్నట్లు ముందస్తు సమాచారం మేరకు ఎస్ఓటి పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకోక మరో ఏడు మంది పరారయ్యారు. వీరి వద్దనుండి సుమారు రెండు లక్షల వరకు విలువ చేసే 3 కిలోల గంజాయిని, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని తుర్కపల్లిలోని జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ కు అప్పగించారు. పట్టుబడిన వారంతా చుట్టూ పక్కల గ్రామాలకు చెందిన యువకులుగా గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.





## చిలకలగూడ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్ ఛాంపియన్' అవగాహన కార్యక్రమం

**పిల్లలకు హెల్మెట్లు పంపిణీ...**

సికింద్రాబాద్, ఏప్రిల్ 15 (మనం న్యూస్) రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా చిలకలగూడ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ ఛాంపియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ అదనపు డీసీపీ అందే రాములు, ట్రాఫిక్ ఏసీపీ ఏ. శ్రీనివాస్ పర్యవేక్షణలో ఆలుగడ్డ బావి జంక్షన్ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని చిలకలగూడా ట్రాఫిక్ సీఐ జగన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వాహనదారులు హెల్మెట్ ధరించినప్పటికీ తమ పిల్లలకు హెల్మెట్ వేయించని ద్విచక్ర వాహనదారులను పోలీసులు ఆపి కౌన్సెలింగ్ నిర్వహించారు. పిల్లల భద్రత కూడా ఎంతో ముఖ్యమని, వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా, పిల్లలకు హెల్మెట్ వేయించని వాహనదారుల పిల్లలకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని అధికారులు సూచించారు.

## రోడ్డు భద్రత అందరి బాధ్యత

(తలకొండపల్లి ఏప్రిల్15/మనం న్యూస్) : చుక్కాపూర్ స్కూల్లో రోడ్డు భద్రత కార్యక్రమం₹నిర్వహించారు రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా తెలంగాణ పోలీస్ శాఖ అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. బుధవారం రోజున చుక్కాపూర్ హై స్కూల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తలకొండపల్లి ఎస్సై కె. శేఖర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్నప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగం, మద్యం సేవించి డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, అతివేగం ప్రమాదకరమని సూచించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు కూడా రోడ్డు నియమాలు పాటించేలా ప్రోత్సహించాలని కోరారు. తర్వాత రోడ్డు ప్రమాదాలపై ప్రతిజ్ఞ చేసినారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పోలీస్ సిబ్బంది నిరంజన్, కురుమయ్య, జాషువా, సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

